క్లుప్తంగా

వరాహావతారంలో జగన్నాథుడు



మునగపాక : మునగపాక, నాగులాపల్లి గ్రామాల్లో సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడు బుధవారం వరాహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి జగన్నాథున్ని భక్తులు దర్శించుకున్నారు. కాగా ఈ నెల 17న జగన్నాథస్వామి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

గంగాలమ్మతల్లి గుడిలో హుండీ చోరీ



హుండీ చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

మునగపాక: మూలపేట గంగాలమ్మతల్లి గుడి ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు హుండీని పగులగొట్టి నగదును అపహరించుకుపోయారు. ఆలయ నిర్మాణంలో భాగంగా ప్రతి రోజు కూలీలతో పనులు జరుగుతున్నాయి. మంగళవారం సాయంత్రం వరకు నిర్మాణ పనులు జరిగాయి. బుధవారం ఉదయం ఆలయ ప్రాంగణానికి కమిటీ సభ్యులు వెళ్లగా ఆలయ ప్రాంగణంలోని హుండీ చోరీకి గురైనట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కానిస్టేబుల్ భాస్కరరావు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. దొంగలను పట్టుకుంటామన్నారు.

గంగాదేవిపేటలో జంగిల్ క్లియరెన్స్



గంగాదేవిపేటలో పొక్లెయిన్‌తో తుప్పలు తొలగింపు పనులు పరిశీలిస్తున్న ఉప సర్పంచ్ దేవేంద్ర

మునగపాక : పూడిమడక రోడ్డు నుంచి గంగాదేవిపేట వెళ్లే దారి పొడవునా ఇరువైపులా పేరుకుపోతున్న తుప్పలు తొలగింపు పొక్లెయిన్ సాయంతో బుధవారం నిర్వహించారు. డ్రైనేజీ కాలువ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని మూలపేట ఉప సర్పంచ్ మొల్లేటి దేవేంద్ర తెలిపారు. పంచాయతీ కార్యదర్శి కాండ్రేగుల లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు.

వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌ను కలిసిన నాయకులు



వైఎస్సార్‌సీపీ అధినేతతో యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద

అచ్యుతాపురం : యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గ సమస్యల గురించి ఆయనకు వివరించినట్టు సమాచారం. అంతకు ముందు జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.

పూడిమడకలో అక్రమ లేఅవుట్‌పై ఫిర్యాదు

అచ్యుతాపురం : మండలంలోని పూడిమడకలో వేసిన అక్రమ లేఅవుట్‌పై ఎన్ని ఫిర్యాదులు చేసినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని, తక్షణమే అనధికార లే అవుట్‌పై చర్యలు తీసుకోవాలని అదే గ్రామానికి చెందిన కాసుబాబు ఫిర్యాదు చేశారు. గతంలో స్పందనలో ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదని, దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఉచిత ఇసుక ఉత్తమాటే...

- టన్నుకు రూ.1250 వసూలు చేస్తున్నారు..
- మండల సభలో ప్రస్తావించిన సభ్యులు
- పలు సమస్యలపై ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో స్వప్న

పాయకరావుపేట : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఎంపీపీ ఇసరపు పార్వతీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులు పలు సమస్యలు సభ దృష్టికి తీసుకొచ్చారు. మండలంలో గల పీఎల్‌పురం, వెంకటనగరం, శ్రీరాంపురం, కేశవరం, గోపాలపట్నం, ఈదటం, పాల్తేరు గ్రామాల్లో తాగునీరు సమస్యలు ఏర్పాడుతున్నాయని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఆయా గ్రామాల్లో పైపు లైనులు ఏర్పాటు, ఇంటింటి కుళాయిలు ఏర్పాటు వాటర్ ట్యాంకులు మరమ్మతులు, వాటర్ ట్యాంక్‌లు నిర్మాణం తదితర సమస్యలపై ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకొచ్చారు. అదే విధంగా పీఎల్ పురం జగనన్న కాలనీలో రోడ్డు నిర్మాణం చేపట్టాలని పీఎల్ పురం సర్పంచ్ పడాల దివాణం సభ దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వం ఇసుక ఉచితంగా సరఫరా చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటనలు చేస్తుందని కానీ టన్ను ధర 1250 రూపాయలు చొప్పున ట్రాక్టర్ ఇసుక గతం కన్నా ఎక్కువగానే అవుతుందని పడాల దివాణం సభ దృష్టికి తీసుకొచ్చారు.

అదే విధంగా ఉపాధి హామీ పనులను రైతులకు అనుసంధానం చేస్తామని ప్రకటించారు కానీ ఆచరణలో ఇంతవరకు రాలేదని పీఎల్ పురం సర్పంచ్ పడాల దివాణం అన్నారు. శ్రీరాంపురం, గోపాలపట్నం గ్రామాల్లో శ్మశాన వాటిక స్థలాల సమస్యలను పరిష్కరించాలని, రెవెన్యూ శాఖ అంతవరకు పరిష్కరించలేదని గోపాలపట్నం, శ్రీరాంపురం సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకొచ్చారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో జరిగిన అవకతవకల పై గ్రామ సభలో తనిఖీ బృందం నిర్ధారించిన నిధులు దుర్వినియోగం పై అధికారులు వాస్తవాలు తారుమారు చేసి ప్రజావేదిక అనంతరం నివేదికలు మార్చివేసారన్నారు. గ్రామ సభలో లక్షల్లో అవకతవకలు జరిగినట్టు తనిఖీ బృందం వెల్లడించిందన్నారు.

కానీ ప్రజావేదిక అనంతరం లక్షలకు బదులు వేలల్లోనే అధికారులు లెక్కలు చూపడం నమ్మశక్యంగా లేదన్నారు. పాయకరావుపేట పట్టణంలో పలు కాలనీల్లో డ్రైనేజీలు సక్రమంగా లేవని, వీధి లైట్లు ఎన్నిసార్లు చెప్పినా వేయడం లేదని సభ్యులు ప్రస్తావించారు. కుళాయిలు ఏర్పాటు కూడా చేపట్టాలని కోరారు. గోపాలపట్నం ఆవ వద్ద నున్న డివిజన్ డ్యామ్ శిథిలావస్థకు చేరిందని, డివిజన్ డ్యామ్ నిర్మాణం చేపట్టి, తలుపులు ఏర్పాటు చేయకపోతే రైతులకు సాగునీరు ఇబ్బందికరంగా వుంటుందన్నారు. డ్యామ్‌లు పూర్తిగా శిథిలమైతే ఆవలో నీరు నిల్వ లేకుండా సముద్రంలోనికి పోతుందని గోపాలపట్నం సర్పంచ్ తెలిపారు. పట్టణంలో గల పలు కాలనీల్లో మద్యం అక్రమంగా విక్రయిస్తున్నారని, రాత్రి సమయంలో మద్యం సేవించి మందుబాబులు వీరంగం చేస్తున్నారని, ఎక్సైజ్ సిబ్బంది దీనిపై స్పందించాలని పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. సభలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు లేవనెత్తిన సమస్యలను అధికారులు వీలైనంత త్వరలో పరిష్కరించాలని ఎంపీడీవో కె.స్వప్న అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ దగ్గుపాటి మాధవి, మండల పరిషత్ ఏవో సిహెచ్.వి.కె వర్మ, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కాదా రామకృష్ణ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వ్యవసాయ పనులు



పచ్చగా దర్శనమిస్తున్న నారుమడి

కోటవురట్ల : మండలంలో ఖరీఫ్ సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వాతావరణం అనుకూలంగా ఉండడంతో పనులు జోరందుకున్నాయి. ప్రస్తుతం ఏ గ్రామంలో చూసినా రైతులు, కూలీలు బిజీగా కనిపిస్తున్నారు. పలు ప్రాంతాలలో ఇప్పటికే నారుపోతలు పూర్తి కాగా అవి ఆశాజనకంగా కనిపిస్తున్నాయి. ఆలస్యమైన పలు ప్రాంతాల్లో రైతులు విత్తనాలు జల్లి నారుపోతలు పూర్తి చేస్తున్నారు. గత ఏడాది 1750 హెక్టార్లలో వరి సాగు జరగగా ఈ ఏడాది కూడా వాతావరణం అనుకూలంగా ఉండడంతో అదే స్థాయిలో నాట్లు పడే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం పాములవాక, దిననబొడ్డేపల్లి, అన్నవరం, బి.కె.పల్లి, యండపల్లి, జల్లూరు, రామచంద్రపాలెం, నీలిగుంట, తంగేడు, లింగాపురం, కోటవురట్ల, కైలాసపట్నం, రాజుపేట, రామచంద్రపురం తదితర ప్రాంతాల్లో ముమ్మరంగా వ్యవసాయ పనులు జరుగుతున్నాయి.

భూసార పరీక్షలకు అనుగుణంగా పంటల సాగు

మునగపాక : భూసార పరీక్షలకు అనుగుణంగా పంటల సాగు చేపట్టడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని శాస్త్రవేత్త శ్రీహరి తెలిపారు. వాడ్రాపల్లిలో బుధవారం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు తప్పనిసరిగా భూసార పరీక్షలపై అవగాహన పెంచుకోవాలని, తద్వారా పెట్టుబడులు తగ్గించుకోవచ్చన్నారు. భూసార పరీక్షలు అవసరమయ్యే మట్టిని ఎలా సేకరించాలనే విషయం వివరించారు. కార్యక్రమంలో బీసీటీ ట్రైనర్ పవన్, రైతులు పాల్గొన్నారు.



భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి



మునగపాక విద్యుత్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సంతోష్ కుటుంబ సభ్యులు

మునగపాక : తమకు న్యాయం చేయాలని కోరుతూ మునగపాకకు చెందిన దాడి సంతోష్‌కుమార్ కుటుంబ సభ్యులు బుధవారం విద్యుత్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఇటీవల మునగపాకకు చెందిన దాడి సంతోష్ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు. సంబంధిత కుటుంబానికి ఎస్ఏ ప్రసాదరావు నేతృత్వంలో అధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. అయితే ఇంతవరకు హామీ నెరవేరకపోవడంతో రైతులతో కలిసి బాధిత కుటుంబం ఆందోళనకు దిగారు. సీఐటీయూ నేత బ్రహ్మాజీ మాట్లాడుతూ విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతు మృతి చెందారని, అయితే బాధిత కుటుంబానికి అధికారులు న్యాయం చేయాల్సి ఉన్నా ఇంతవరకు పట్టించుకోలేదన్నారు. రైతు సంఘ అధ్యక్షుడు ఆడారి మహేష్, రైతులు ఆడారి జగ్గారావు, దాడి అప్పారావు, వెలగా మురళి, పెంటకోట జగ్గారావు ఆందోళనలో పాల్గొన్నారు. కాగా ఈ విషయాన్ని స్థానిక నేతలు ఎమ్మెల్యే విజయ కుమార్ దృష్టికి ఫోన్‌లో తీసుకురావడంతో ఆయన స్పందించి మృతుడు సంతోష్ భార్యకు ఉద్యోగం ఇలాగే విద్యుత్‌శాఖ సిబ్బంది నుంచి రూ.లక్ష వరకు సాయం అందజేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

రైతుల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి



సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే విజయకుమార్‌కు వినతి అందజేస్తున్న రైతులు

మునగపాక : రైతుల సమస్యలు పరిష్కరించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. వ్యవసాయానికి ఉచిత పథకం అనుసంధానం చేయాలని, పంట పొలాల్లో ప్రమాదకరంగా ఉన్న వైర్లను సరి చేయాలని, మునగపాక పశువైద్యాధికారి ప్రదీప్‌కుమార్‌ను బదిలీ చేయకుండా చూడాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యేకు వినతి అందజేశారు. వినతి అందజేసిన వారిలో రైతు సంఘ అధ్యక్షుడు ఆడారి మహేష్, ఉపాధ్యక్షుడు దాడి శివ, ఆడారి శ్రీకాంత్, కార్యదర్శి విల్లూరి సూరిసర సింగరావు, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు టెక్కలి పరశురామ్, రైతు దాడి భీమునాయుడు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ, ఆశా, వెలుగు సిబ్బందికి న్యాయం చేయాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం



నక్కపల్లిలో ఏవోకు వినతి పత్రం అందిస్తున్న సీఐటీయూ నేతలు

నక్కపల్లి : కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం అంగన్‌వాడీ, ఆశా, వీవోఏల సమస్యలు పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం. అప్పలరాజు, జిల్లా కమిటీ సభ్యురాలు అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు దుర్గారాణి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది వివిధ శాఖల్లో పనిచేస్తున్న సిబ్బంది బుధవారం ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళన చేశారు. ఈ మేరకు ఎంపీడీవో కార్యాలయ పరిపాలనాధికారి సీతారామరాజుకు వినతి పత్రం ఇచ్చారు. ప్రభుత్వం అంగన్‌వాడీ, ఆశా, వెలుగు సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. వేతనాలు రూ.26 వేలకు పెంచాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ, బీమా, పింఛను సదుపాయాలు కల్పించాలన్నారు. ఏళ్ల తరబడి వీరు చేస్తున్న డిమాండ్లు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. తక్షణమే వీరందరికీ ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు న్యాయమైన కోర్కెలు నెరవేర్చాలన్నారు. పంచాయతీ కార్మికులకు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో సీపీఎం కార్యదర్శి ఎం. రాజేష్, అంగన్‌వాడీ యూనియన్ నేతలు సుబ్బలక్ష్మి, సీఐటీయూ నేతలు నాగమణి, సత్యనారాయణ మధ్యాహ్న భోజన కార్మిక సంఘ నాయకులు నారాయణరావు, లోవరాజు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : చాలీ చాలని జీతాలతో పని చేస్తున్న వెలుగు వీవోఏ ల అంగన్‌వాడీల సమస్య తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి వి.వి. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కోర్కెల దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశారు. వీవోఏల 3 ఏళ్ల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, ప్రైవేటీకరణకు స్వస్తి చెప్పాలని, నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీవోఏల యూనియన్ జిల్లా కార్యదర్శి సిహెచ్ రూపాదేవి, రాజేష్, రమణ, సత్యవతి, పద్మావతి కలిసి తహసీల్దార్ విజయలక్ష్మికి వినతి పత్రం అందజేశారు.

కొత్త విద్యార్థులకు స్వాగతం...

ఎస్.రాయవరం : ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యనందించేందుకు పరిణతి పొందిన ఉపాధ్యాయులు ఉన్నారని పెదగుమ్ములూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ అన్నారు. పాఠశాలలో బుధవారం నూతన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ప్రెషర్స్ డే నిర్వహించారు. ఈ ఏడాది పాఠశాలలో అత్యధికంగా విద్యార్థులు చేరడంతో ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. గత ఏడాది సిలబస్ సుమారు 60 రోజులు పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించడం వలన పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ ఇవ్వడం తదితర కార్యక్రమాలు చేపట్టడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి కనబరిచారన్నారు. ఈ సమయ విద్యార్థులు అధిక సంఖ్యలో జాయిన్ అయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు కొత్తగా చేరిన వారికి పుష్పగుచ్ఛాలు అందించిన స్వాగతం పలికారు. విద్యార్థులంతా కలిసి సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించిన సందడి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో నూతనంగా చేరిన పిల్లలకు స్వాగతం పలుకుతున్న పాఠశాల విద్యార్థులు

రహదారిలో పొంచి ఉన్న ప్రమాదం



అన్నవరం-వేములపూడి రహదారిలో ఉన్న ప్రమాదకర రంధ్రం

కోటవురట్ల : గ్రామీణ రహదారులు అధ్వాన స్థితిలో ఉన్నాయి. పలు రహదారులు గోతులు పడి దారుణంగా ఉండగా మరికొన్ని చోట్ల ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. అన్నవరం నుంచి వేములపూడి వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిలో ఓ చోట పెద్ద రంధ్రం పడింది. వాహన ప్రయాణీకులు కాస్త ఏమరుపాటుగా వుంటే గోతిలో పడి గాయపడే ప్రమాదం ఉంది. ఈ రహదారిలో రైతులు, విద్యార్థులు, వ్యాపారులు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి గొయ్యిని పూడ్చాలని పలువురు కోరుతున్నారు.

బాధితులకు వైఎస్సార్‌సీపీ నేతల పరామర్శ



ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న వీసం

నక్కపల్లి : ఇంజక్షన్ వికటించి నక్కపల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను బుధవారం రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ తదితరులు పరామర్శించారు. ఇంజక్షన్ వికటించి 21 మంది అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. వీరిలో 17 మందిని అనకాపల్లి ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మిగిలిన వారు నక్కపల్లిలో చికిత్స తీసుకుంటున్నారు. వీరిని వీసం పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్ తళ్ల భార్గవ్, స్టూడెంట్ విభాగం జిల్లా అధ్యక్షుడు హరి ఉన్నారు.

ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడిన మాజీ ఎమ్మెల్యే జోగులు

అనకాపల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల ఆరోగ్య పరిస్థితిని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంబాల జోగులు తెలుసుకున్నారు. బుధవారం ఆయన ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో ఫోన్‌లో మాట్లాడారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. 17 మందిలో 15 మంది పూర్తిగా కోలుకున్నారని వారిని ఇళ్లకు పంపించామని, మిగిలిన వారికి ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నట్టు సూపరింటెండెంట్ తెలిపారని జోగులు చెప్పారు.

ఏటికొప్పాక , తాండవ ఫ్యాక్టరీలను తెరిపించాలి

- చంద్రబాబుకు సీపీఎం నేతల విజ్ఞప్తి

నక్కపల్లి : నష్టాల్లో కూరుకుపోయి మూతపడ్డ తాండవ, ఏటికొప్పాక సుగర్ ఫ్యాక్టరీలను తెరిపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు సీపీఎం నాయకులు విజ్ఞప్తి చేశారు. బుధవారం పార్టీ జిల్లా కార్యదర్శి సభ్యుడు ఎం.అప్పలరాజు, మండల కార్యదర్శి రాజేష్ నక్కపల్లిలో విలేకర్లతో మాట్లాడుతూ ఫ్యాక్టరీ కార్మికులకు బకాయిలు చెల్లించడంతో పాటు నిధులు మంజూరు చేసి ఫ్యాక్టరీలను తెరిపించాలన్నారు. తాండవ, వరాహనదులు గట్టు పటిష్టానికి నిధులివ్వాలన్నారు. నక్కపల్లి వద్ద డిగ్రీ కళాశాలకు సొంత భవనాలు నిర్మించాలని, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న అప్పలరాజు

ఉద్దండపురం వాటర్ గ్రిడ్‌ను పూర్తి చేయాలన్నారు. కోటవురట్ల మండలం పందూరు, జల్లూరు వంతెనల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఏపీఐఐసీ సేకరించిన భూములకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు ప్యాకేజీ చెల్లించాలని కోరుతున్నామన్నారు.

గోరింటాకు పెట్టుకున్నామోచ్...



చేతికి పెట్టుకున్న గోరింటాకు చూపిస్తున్న చిన్నారులు

అచ్యుతాపురం : ఆషాఢమాసంలో గోరింటాకు పెట్టుకోవడం ద్వారా ఆరోగ్యానికి మేలు జరుగుతుందని సమసరా సేవా ఫౌండేషన్ జిల్లా మహిళా కన్వీనర్ రామలక్ష్మి అన్నారు. అచ్యుతాపురం వికలాంగుల ఇంటిగ్రేటెడ్ పాఠశాలలో పిల్లలకు గోరింటాకుపై అవగాహన కల్పించారు. పెదపాటి కృష్ణవేణి, బొద్దపు సూరకర్తం, కింతాడ వరలక్ష్మి, కరణం దివ్య, వెన్నెల నాయుడు, కొల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్ : యలమంచిలి 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం 11కేవీ యలమంచిలి టౌన్-2 ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఈ నెల 12వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పట్టణంలోని ధర్మవరం, సినీ పేట, కొత్తూరువీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ రాజేశ్వర్ తెలిపారు.

తీర ప్రాంత ఆక్రమణలపై ఫిర్యాదు

అచ్యుతాపురం: పూడిమడక తీరం వెంబడి ఆక్రమణల గురించి స్థానికులు కొందరు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌కు ఫిర్యాదు చేశారు. పూడిమడక శివారు కడపాలెంలో లింగాల చెట్టు దిబ్బ నుంచి దోని వారి దిబ్బ వరకూ కొందరు తీర ప్రాంతంలో గెడెలు పెంచడం వల్ల తీర ప్రాంతంలో బోటుల బెడద పెరిగిందని, తీర ప్రాంతంలో వర్షాల వల్ల బోట్లను ఉంచడం, వలలు పెట్టుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్టు పేర్కొన్నారు. ఎం.రాజు, వై.రాజబాబు, కె.అప్పలరాజు, ఎం.రమణ, రాజు, కాసుబాబులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే విజయకుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న స్థానికులు

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

మునగపాక : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సీహెచ్‌వో యామిని కోరారు. గంగాదేవిపేటలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం సీజన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోస్టర్ల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా యామిని మాట్లాడుతూ వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఇంటి ఆవరణలో నీటి నిలువలు లేకుండా చూడాలని అన్నారు. ఏఎన్ఎం రమణి, సూపర్‌వైజర్ లక్ష్మి, విశ్వనాథం, హెచ్ఎం విజయ, వార్డు సభ్యురాలు వాకపల్లి సూరాలమ్మ తదితరులు పాల్గొన్నారు.



గంగాదేవిపేటలో పోస్టర్ల ప్రదర్శన